ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం అక్టోబరు 11, 2024

రైతులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో శనివారం జరగనున్న రైతుల పండగకు అన్నదాతలు తరలిరావాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. ప్రారంభించనున్న టర్బైన్‌ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి ఆయిల్‌పాం రైతులు పెద్దఎత్తున రానున్న ఈ పండగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి, ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు, తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు.


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ జితేశ్, చిత్రంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

స్టాల్స్ ఎక్కడెక్కడ ఉండాలో దిశానిర్దేశం చేశారు. ఆయిల్‌పాం హబ్‌గా పేరుగాంచిన భద్రాద్రి జిల్లాలోని పామాయిల్ పరిశ్రమల నుంచి వచ్చే ఓఈఆర్ దేశానికే ఆదర్శంగా మారనుందని అభిప్రాయపడ్డారు. అనంతరం కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రాన్ని సందర్శించారు. తోటల చుట్టూ వెదురు మొక్కలు నాటుకోవాలని సూచించారు. టీజీ ఆయిల్‌ఫెడ్ సలహామండలి సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజనల్ అధికారి బాలకృష్ణ, మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, ఉద్యానాధికారి కిశోర్, బండి భాస్కర్ పాల్గొన్నారు.

పండుగ నాటికి
పరిహారం డబ్బులు

రైతుల ఖాతాల్లో నేరుగా జమ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) మంజూరు చేసింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు చెల్లించనుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, వరి, మిరప, తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6 మధ్య కురిసిన భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లాకు అత్యధిక నష్టం జరిగింది. ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో నష్టం వాటిల్లినా అత్యధికంగా ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, కూసుమంచి, ఎర్రుపాలెం, మధిర, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పాల్వంచ మండలాల్లో ఎక్కువ నష్టం జరిగింది. మున్నేరు పరీవాహక ప్రాంతం, పాలేరు, ఆకేరు ప్రాంతాల్లో వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కేంద్ర బృందం సభ్యులు, మంత్రులు పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారులు నష్టం అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశించింది.

ఉద్యాన పంటలు...

ఖమ్మం జిల్లాలో 6,102 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయగా 3,287.9 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా మిరప 3,032.24 ఎకరాల్లో నష్టపోయింది. ఖమ్మం గ్రామీణం, మధిర, తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం మండలాల్లో నష్టం వాటిల్లింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.3.28 కోట్ల పంట నష్టపరిహారం మంజూరు చేసినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు.

మధిర మండలంలో దెబ్బతిన్న పంటలు ఏఈఓకు చూపిస్తున్న రైతులు (పాత చిత్రం)



జిల్లాల వారీగా..

	ఖమ్మం	భద్రాద్రి
ఎకరాలు	28,407.04	2,656.15
రైతులు	27,241	2,148
పరిహారం (రూ.కోట్లలో)	28.40	2.65

ఒకట్రెండు రోజుల్లో ఖాతాల్లోకి... దనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. బిల్లులను తయారు చేసి ఖజానా శాఖకు సమర్పించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఒకట్రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాబోయే ఐదు రోజుల్లో జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించినట్లు చెప్పారు. పొలం పనులకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ప్రతికూల వాతావరణంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు.

ఆడిన వారికి ఉయ్యాలో..
పాడిన వారికి ఉయ్యాలో..

● ముగిసిన బతుకమ్మ వేడుకలు

తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాల నడుమ సాగిన వేడుకలకు మహిళలు, యువతులు, చిన్నారులు సద్దుల బతుకమ్మతో ముగింపు పలికారు. అమ్మవారికి పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వండి నైవేద్యంగా సమర్పించారు. చివరి రోజు సాయంత్రం వాడవాడలా విరుల వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి మహిళలు, యువతులు, చిన్నారులు తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం పూట కూడళ్ల వద్దకు చేరుకొని "బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.." అంటూ ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం


టేకులపల్లిలో యువతి సంబరం


టేకులపల్లి.. బతుకమ్మలతో యువతి



పాల్వంచలో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు


పాల్వంచ రాతిచెరువులో నిమజ్జనం చేస్తూ..


కొత్తగూడెం శ్రీనగర్‌లో..


పినపాకలో భారీ బతుకమ్మతో


పాల్వంచ పట్టణంలో...


టేకులపల్లి కోదండ రామాలయం ప్రాంగణంలో వేడుకలు


పాల్వంచలో..


కొత్తగూడెం కలెక్టరేట్: రామా టాకీస్ ఏరియాలో..


ఇల్లెందు: ఇల్లెందులపాడు చెరువు వద్ద మహిళల ఆటపాటా..


పాల్వంచ కేటీపీఎస్ రాధాకృష్ణ ఆలయంలో సంబరాలు


భద్రాచలం పట్టణం: బతుకమ్మ వేడుకల్లో శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మహిళా ఉద్యోగులు, ఈఓ రమాదేవి

విధులకు ఇద్దరు వైదిక ఉద్యోగుల గైర్హాజరు

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం రామాలయ వైదిక ఉద్యోగులిద్దరు అధికారికంగా సెలవు తీసుకోకుండానే విధులకు గైర్హాజరైన ఘటన గురువారం బయటపడింది. రెండు రోజుల క్రితం వీరిద్దరూ వేర్వేరుగా సెలవు కోసం ప్రయత్నించినప్పటికీ ఇక్కడి పరిస్థితుల ప్రకారం సెలవు మంజూరు కాలేదు. సెలవు మంజూరవుతుందో లేదో వేచిచూడకుండానే తాము అనుకున్న చోటుకు వెళ్లారు. ఈ వివాదం దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు చేరటంతో వీరిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.



ఇక్కడ కాదని.. వేరేచోటుకు

రామాలయంలో ఈనెల 4న ఆరంభమైన విజయదశమి ఉత్సవాలు శనివారం (ఈనెల 12) వరకు కొనసాగనున్నాయి. రోజూ రామాయణ పారాయణం జరుగుతోంది. కీలక సమయంలో వైదిక ఉద్యోగులపై పనిభారం పడకుండా తాత్కాలికంగా కొంతమంది సిబ్బందిని తీసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇద్దరు సీనియర్ వైదిక పెద్దలు అధికారికంగా సెలవు తీసుకోకుండానే ఆంధ్రప్రదేశ్‌లోని మరో దేవస్థానంలో కొనసాగుతున్న పూజలకు వెళ్లి ప్రవచనాలు ఇచ్చారని సమాచారం. వీరి ప్రసంగాలను ప్రచార మాధ్యమాల్లో కొందరు అధికారులు వీక్షించి ఆరా తీయడంతో ఈ విషయం బయటపడింది. దసరా ఉత్సవాల తరుణంలో సెలవులు ఇవ్వటానికి వీల్లేదని దేవస్థానం నుంచి ఇటీవల సర్క్యులర్ జారీ అయ్యింది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ ఉద్యోగుల సేవలు అవసరం ఉండటంతో సెలవు ఇవ్వటం కుదర్లేదు. తాను సెలవు కోసం కార్యాలయాన్ని సంప్రదించానని ఓ వైదిక పెద్ద 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇదే విషయంపై ఈఓ రమాదేవి మాట్లాడుతూ అధికారికంగా ఎవరికీ సెలవులు ఇవ్వలేదని, ఈ అంశంపై ఉన్నతాధికారుల సూచనల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు.

పతకాలు సాధించిన అధికారులు, సిబ్బందికి అభినందన

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పతకాలు సాధించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ బి.రోహిత్‌రాజు గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. వరంగల్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో జోనల్ పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు 7 స్వర్ణ, 7 వెండి, 8 కాంస్య పతకాలు సాధించారు. 22 పతకాలతో జోనల్‌లో రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన వారిలో సీఐలు టి.కరుణాకర్ (అశ్వారావుపేట), ఎం.కరుణాకర్ (కొత్తగూడెం వన్‌టౌన్), టి.రమేశ్ (కొత్తగూడెం టూ టౌన్), ఎస్సైలు రాణాప్రతాప్ (జూలూరుపాడు), జి.స్వప్న (చంద్రుగొండ), పి.నాగుల్‌మీరా (ఇల్లెందు), డి.శ్రీనివాస్ (పీఆర్ఓ, ఎస్పీ కార్యాలయం), కానిస్టేబుల్స్ ఎస్‌కె.హుస్సేన్ (ఎక్స్‌ప్లోజివ్, డాగ్‌హ్యాండ్లర్), టి.వెంకటేశ్ (ట్రాకర్ డాగ్ హ్యాండ్లర్), జి.నరేశ్ (బీడీ టీమ్), ఆర్.ప్రశాంత్ (బీడీ టీమ్), ఎం.బాబురావు (బీడీ టీమ్), కె.నరేందర్ (కొత్తగూడెం ట్రాఫిక్ వీడియోగ్రాఫర్) ఉన్నారు.


పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ బి.రోహిత్‌రాజు

సింగరేణి లక్ష్యాలపై అవగాహన అవసరం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: విధి నిర్వహణపై సంపూర్ణ అవగాహన ప్రతి ఉద్యోగికి అవసరమని డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డి అన్నారు. 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై సెంట్రల్ వర్క్‌షాప్, ప్రధాన వైద్యశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సెంట్రల్ వర్క్‌షాప్, మెయిన్ వర్క్‌షాప్, సెక్యూరిటీ, ఎస్అండ్‌పీసీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్ మాట్లాడుతూ సింగరేణి భవిష్యత్ కార్యాచరణ, లక్ష్యాలను వివరించారు. డైరెక్టర్ సత్యనారాయణరావు, గుర్తింపు సంఘం నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నాయకులు త్యాగరాజన్, పీతాంబరరావు హాజరయ్యారు.

మెరుగైన జీవన శైలితో మానసిక ఆరోగ్యం

కొత్తగూడెం వైద్యవిభాగం: మెరుగైన జీవనశైలితో మానసిక ఆరోగ్యం సాధించవచ్చునని డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ అన్నారు. ఆరోగ్యకర జీవన విధానానికి వ్యాయామం, పరిమిత ఆహారం అవసరమని తెలిపారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ఒత్తిడిని తగ్గించుకోడానికి ధ్యానం, యోగా సాధన చేయాలన్నారు. మానసిక వ్యాధిగ్రస్థులను గుర్తించి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా సర్వజన ఆసుపత్రిలోమెరుగైన వైద్యసేవలందిస్తున్నామన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మధువరన్, బాలాజీనాయక్, స్పందన, కళ్యాణ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఖాతాల్లో పింఛను జమ



చుంచుపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులకు గత నెలకు సంబంధించిన పింఛను నగదు ఎట్టకేలకు వారి ఖాతాల్లో జమ అయ్యింది. సెప్టెంబరు నెలలో ఏడు బిల్లులకు సంబంధించి 3,933 మంది పింఛనుదారులకు బుధవారం వరకు నగదు జమ చేయలేదు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు, ఖజానా శాఖాధికారులకు సైతం సంఘం నాయకులు విన్నవించారు. ఈ సమస్యపై 'పండగొస్తోంది.. పింఛనేదీ' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 10న కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు 'ఈ-కుబేర్' సాంకేతిక సమస్యను పరిష్కరించి గురువారం ఉదయమే పింఛనర్ల ఖాతాలకు నగదు జమ చేశారు.

చెరువులకు పర్యాటక సొబగులు..!

మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే

మణుగూరు మండలం రేగులగండి, పేరంటాల చెరువు, అశ్వాపురం మండలం తుమ్మలచెరువు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం యత్నిస్తోంది. తొలుత రేగుల గండికి ప్రాధాన్యమివ్వనుంది. తర్వాత పేరంటాల చెరువు, తుమ్మల చెరువులను తీర్చిదిద్దనుంది. రేగులగండిని జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు ఇటీవల సందర్శించి వెళ్లారు.

గతమెంతో ఘనం

రేగులగండి ఒకప్పుడు ఈ ప్రాంతంలో గొప్ప పర్యాటక కేంద్రంగా వెలుగొందింది. అన్ని మండలాల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించేవారు. సింగరేణి ఆనాడు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసింది. రేగులగండి నుంచే నాడు తాగునీటిని పొందేది. తర్వాత గోదావరి నుంచి తాగునీటిని తీసుకుంటుండటంతో ఈ ప్రాంతం క్రమంగా ప్రాధాన్యతను కోల్పోయింది. సింగరేణి కూడా తర్వాత దీన్ని పట్టించుకోవడం మానేసింది. అటవీ శాఖ ఈప్రాంతాన్ని తిరిగి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని యోచిస్తుండటంతో పర్యాటకుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రేగులగండి తర్వాత ఈ ప్రాంతంలో పేరంటాల చెరువును పర్యాటకంగా అధికారులు తీర్చిదిద్దనున్నారు. తర్వాత తుమ్మలచెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దే యోచనలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. విశేషమేమంటే గతంలోనే అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంలో ఈ మేరకు కొన్ని చర్యలు చేపట్టారు. స్థానికులు తుమ్మలచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని నాడు కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న రేణుకాచౌదరిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని 50 ఎకరాల గుట్టను అటవీశాఖ అధికారులు ఈ సందర్భంగా అడుగుతున్నారు. ఆ గుట్టపై నుంచి చూస్తే తుమ్మల చెరువు దృశ్యం బాగుంటుంది. ఆ 50 ఎకరాలను రెవెన్యూ అధికారులు అటవీశాఖకు స్వాధీనపరిస్తే తుమ్మలచెరువును కూడా పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.


రేగుల గండి


పర్యాటకంగా తీర్చిదిద్దే ప్రతిపాదనలు
ఎస్.రమేశ్, ఎఫ్ఆర్ఓ, అశ్వాపురం

అటవీ శాఖ ఆధ్వర్యంలో రేగులగండి, పేరంటాల చెరువు, తుమ్మల చెరువు ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దే ప్రతిపాదనలు ఉన్నాయి. జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు ఇటీవల ఈ ప్రాంతాలను సందర్శించి వెళ్లారు.

రతన్ టాటాతో ఖమ్మానికి అనుబంధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

పారిశ్రామిక మేరు నగధీరుడు రతన్ టాటా ఇక లేరు అన్న సమాచారంతో ఖమ్మం జిల్లాలో విషాదం నెలకొంది. ఆయనకు జిల్లాతో అనుబంధం ఉంది. గతంలో ఖమ్మం నగరానికి వచ్చి ఇక్కడి వ్యాపార సముదాయాల్లో కొంత సమయం గడిపారు. వ్యాపారులతో మాట్లాడిన అనుభవాలు ఉన్నాయి. 1983లో నాటి నెల్కో రేడియోను పరిచయం చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన నాటి వ్యాపార భాగస్వామి దివంగత కాళ్ల వెంకటరామారావు ఇంటికి వచ్చారు. అక్కడే బస చేసి వచ్చిన పని పూర్తి చేసుకున్నారు. రతన్ టాటా తమ ఇంటికి వచ్చిన సందర్భాన్ని కమాన్‌బజార్‌లోని కాళ్ల కుటుంబ సభ్యులు, ఇక్కడి వ్యాపారులు గుర్తు చేసుకున్నారు. రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు. విలువలతో కూడిన వ్యాపారం చేసిన ఆయన దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.



ఖమ్మం: కమాన్‌బజార్లోని కాళ్ల ఏజెన్సీ వ్యాపార సముదాయంలో రతన్ టాటా

30 ఏళ్లక్రితం భద్రాచలంలో..

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంతో వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు గొప్ప అనుబంధం ఉంది. సుమారు 30 ఏళ్ల క్రితం ఆయన చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చి ఉంటే భక్తులకు సకల సదుపాయాలు అందుబాటులోకి రావటంతో పాటు ఆలయ విస్తరణ మరోస్థాయిలో ఉండేదని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం గురించి తెలుసుకున్న రతన్‌టాటా సుమారు మూడు దశాబ్దాల క్రితం తన బృందంతో ఇక్కడికి వచ్చారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ రోజుల్లోనే ఆయనకు ఘనస్వాగతం లభించింది. క్షేత్ర విశిష్టతను తెలుసుకొని ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై దేవాదాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. కీలక అంశాలపై చర్చించారు. రామాలయం సంపూర్ణ అభివృద్ధికి ఎంత ఖర్చవుతుందో నివేదికలను అందిస్తే తామే ఆ పనులు చేసి నిర్మాణాలను అప్పగిస్తామనే ప్రతిపాదనను దేవస్థానం అధికారుల ముందు ఉంచినట్లు సమాచారం. భక్తులకు కల్పించే వసతి భవనాలే కాకుండా ఆలయ విస్తరణపైనా చర్చించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలను నాటి అధికారులు ఒప్పుకోలేకపోయారు. అప్పటి నిబంధనల ప్రకారం దాతలు ఎంత గొప్పవారైనా విరాళాలిస్తే.. ఆమొత్తంతో దేవస్థానమే వారి పేరిట నిర్మాణాలు చేపట్టేది. ఇదే విషయాన్ని రతన్‌టాటాకు ఆలయాధికారులు వివరించారు. అందుకే రతన్‌టాటా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాతైనా వీటిపై రెండువైపులా చర్చలు సాగి ఉంటే రామాలయ అభివృద్ధికి ఆ రోజుల్లోనే ముందడుగు పడేదని భక్తులు గుర్తుచేసుకుంటున్నారు.

వ్యాపార దిగ్గజానికి నివాళి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా ఎంతో మందికి మార్గదర్శకుడని రఘునాథపాలెం మండలం ఈర్లపూడి యూత్ నాయకుడు కుమ్మరి వెంకట కోటయ్య అన్నారు. యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో రతన్‌టాటా ఫ్లెక్సీని ఏర్పాటు చేసి గురువారం నివాళులర్పించారు. దేశంలో వ్యాపారాలు విస్తరించడంతోపాటు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఆయన కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, కృష్ణప్రసాద్, సందీప్, శ్రీనివాస్, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఈర్లపూడిలో రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

విద్యుదుత్పత్తి చేసేలా..
సొంత అవసరాలు తీర్చేలా..

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో రూ.36 కోట్లతో నిర్మించిన ఆధునిక టర్బైన్ ప్రారంభానికి ముస్తాబైంది. పామాయిల్ పరిశ్రమలో గానుగ ఆడగా వచ్చే ఖాళీ గెలల ద్వారా 2.50 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసి పరిశ్రమ అవసరాలు తీర్చేలా దీని ఆకృతిని రూపొందించారు. నూతన టర్బైన్‌లో రిప్రియేట్ డ్రై అవుట్ దశ, ఆల్కలీ బాయిల్ అవుట్ దశ పూర్తయ్యాయి. ఈ టర్బైన్‌ను పూర్తిగా కంప్యూటర్లు, ఆటోమేటిక్ యంత్రాలతో ఏర్పాటు చేశారు.

ఏడాదికి రూ.1.50-1.80 కోట్ల ఆదా

షెడ్డెడ్ ఫైబర్‌తో నడిచే ఈ బాయిలర్ సామర్థ్యం 30 టీపీహెచ్ (టన్ను పర్ అవర్)గా 2.50 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసేలా నిర్మించారు. దీనివల్ల నెలకు రూ.15లక్షలకు తగ్గకుండా ఏడాదికి రూ.1.50 కోట్ల నుంచి రూ.1.80 కోట్ల వరకూ విద్యుత్తు బిల్లు ఆదా కానుంది. పామాయిల్ పరిశ్రమకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా అవనుంది. అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమలో వినియోగించిన ఇదే సాంకేతిక పరిజ్ఞానం సత్ఫలితాలనిస్తోంది. వచ్చే ఏడాది 60 టన్నుల సామర్థ్యంతో నూతన పామాయిల్ పరిశ్రమ ప్లాంట్ పనులు ప్రారంభం కానున్నాయి.



అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో ఆధునిక టర్బైన్

టర్బైన్ ప్రారంభోత్సవానికి మంత్రుల రాక

నూతన టర్బైన్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, పి.బలరాంనాయక్, టీజీ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు హాజరుకానున్నారని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



అమ్మ పనిబాట.. బుజ్జాయి ఆటాపాట

ఉద్యోగం చేసే మహిళలకు చిన్నపిల్లలను చూసుకోవడం ఇబ్బందే. ఇంటివద్ద పెద్దలెవరూ లేనప్పుడు ఆయాలను ఏర్పాటు చేసుకోవడం, పిల్లలు ఎలా ఉన్నారో అని ఆందోళన చెందటం సాధారణమే. దీనికి పరిష్కారంగా ఖమ్మం కలెక్టరేట్‌లో శిశు సంరక్షణ కేంద్రం(క్రెచ్) ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని జిల్లా కార్యాలయాలు ఇక్కడే ఉండటంతో చిన్న పిల్లల తల్లులకు ఇక్కట్లు తీరాయి. ఉదయం విధులకు హాజరయ్యే సమయంలో ఇందులో పిల్లలను వదిలిపెట్టి సాయంత్రం వెళ్లేటప్పుడు తీసుకెళ్తున్నారు. ఇక్కడ ఆట వస్తువులు, చిన్న మంచాలు, జారుడు బల్లలు, గోడలపై తీర్చిదిద్దిన బొమ్మలు పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. సిబ్బంది చిన్నారులను లాలించి ఆడిస్తున్నారు.

– ఖమ్మం నగరం, న్యూస్‌టుడే – ఈనాడు, ఖమ్మం

ఆ కుటుంబంలో ఆరుగురు ఉపాధ్యాయులు..!

పాల్వంచ, న్యూస్‌టుడే

ఇప్పటికే ఆ ఇంట్లో ముగ్గురు సోదరులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి వారసులలో మరో ముగ్గురు తాజా డీఎస్సీలో కొలువులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో.. కృషి, పట్టుదల తోడుగా అద్భుత విజయాలందుకున్న యువ సోదరులు గ్రామస్థుల అభినందనలు అందుకున్నారు. పాల్వంచ మండలం బొజ్యాతండాకు చెందిన నూనవత్ హరిసింగ్, మీరమ్మలకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. కుమారుల్లో రాంబాబు, శంకర్, భిక్షంలు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తాజాగా వెల్లడైన డీఎస్సీ-2024 ఫలితాల్లో రాంబాబు కుమారుడు హరీశ్‌కుమార్‌తో పాటు ఆయన మిగతా ఇద్దరు అన్నల కుమారులూ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. వీరిలో హరికిషన్ కుమారుడు సురేందర్, బాబు కుమారుడు నరేందర్‌లు ఉన్నారు. ఒకే నోటిఫికేషన్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు టీచర్ కొలువు సాధించటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. విజేతలుగా నిలిచి నియామక పత్రాలు అందుకున్న ఆ ముగ్గురు యువకులను గ్రామస్థులు అభినందించారు. 'ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న మా బాబాయిలనే స్ఫూర్తిగా తీసుకున్నాం. ఎలాంటి శిక్షణ లేకుండా, వారి మార్గ నిర్దేశనంలోనే కొలువులు సాధించడం ఆనందంగా ఉంది' అని వారన్నారు. వీరి మేనత్త సరోజ భర్త శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉద్యోగే కావడం కొసమెరుపు.



హరీశ్‌కుమార్, సురేందర్, నరేందర్

తండ్రి బాటలో.. ప్రత్యేక విద్య కోటాలో..

హరీశ్‌కుమార్ గత ఆరేళ్లుగా ప్రత్యేక విద్య విభాగంలో తాత్కాలిక పద్ధతిలో బోధన కొనసాగించారు. గత డీఎస్సీ నోటిఫికేషన్ రాగానే తన తండ్రి, ఇద్దరు బాబాయిల సూచనలతో, పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 23వ ర్యాంకు సాధించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఆరేళ్లుగా నిరీక్షించి.. విజేతగా నిలిచి..

ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనేది నరేందర్ కల. ఈ కలను నెరవేర్చుకునేందుకు ఆయన ఆరేళ్లుగా నిరీక్షించారు. ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా పరీక్షకు సిద్ధమయ్యారు. ఎస్జీటీలో దివ్యాంగుల కోటాలో జిల్లాలో ఒకటో ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు బాబు, బాజు ప్రోత్సాహం, బాబాయిల స్ఫూర్తితో విజయం సాధించారు. త్వరలో కొలువులో చేరనున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని నరేందర్ చెప్పారు.

ఆన్‌లైన్ శిక్షణ తీసుకుని..

డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడటంతోనే సురేందర్ సన్నద్ధత ప్రారంభించారు. తల్లిదండ్రులు హరికిషన్, అనసూర్య ప్రోత్సాహంతో, ఉపాధ్యాయులైన బాబాయిల సలహాతో ఇంటి నుంచే ఆన్‌లైన్ శిక్షణ పొందారు. ఆ తర్వాత ప్రణాళికాబద్ధంగా.. రోజువారీగా ప్రత్యేక సమయం కేటాయించుకొని డీఎస్సీకి పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఎస్జీటీ పోస్టుల్లో జిల్లా స్థాయిలో 29వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. మరో ఇద్దరు సోదరులతో కలిసి తానూ ఉపాధ్యాయ పోస్టు సాధించడంపై సురేందర్ సంతోషం వ్యక్తం చేశారు.



చింతాల పుల్లారావు



విజయలక్ష్మి



శ్రీహరి

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు.. ఒకరు ఉపాధ్యాయుడు

సుజాతనగర్: ఓ ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి శెభాష్ అనిపించుకున్నారు. సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతాల పుల్లారావు ఎమ్మెస్సీ బీఈడీ చదివారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది మార్చిలో నోటిఫికేషన్ రావడంతో పట్టుదలతో చదివారు. ఇటీవలి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(గణితం)లో జిల్లాలో 10వ ర్యాంకు సాధించి కొలువు దక్కించుకున్నారు. ఆయన భార్య విజయలక్ష్మి, సోదరుడు శ్రీహరి కూడా ఎమ్మెస్సీ బీఈడీ చదివారు. ఇద్దరూ ఉన్నత విద్యావంతులే కావడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహంతో 2019లో శ్రీహరి, విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికయ్యారు. రెండు పర్యాయాలు విఫలమైనా నిరాశ చెందని పుల్లారావు.. తాజా డీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కొండపల్లి, న్యూస్‌టుడే: ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి ఆరు పంపుల కూడలిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దు అన్నపూర్ణ అనే మహిళ ఇంటి ముందు నిల్చొని ఉండగా అటుగా వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని గొలుసును లాక్కొని పరుగెత్తాడు. బాధితురాలు కేకలు వేయగా గమనించిన కొందరు యువకులు ఆ దొంగను పట్టుకున్నారు. నిందితుడిది ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామం అని తేలింది. యువకులు దొంగను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



దొంగతనం చేసిన వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

వైభవంగా ఐశ్వర్య లక్ష్మి అమ్మకు పూజలు

భద్రాచలం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భద్రాచలంలో రోజురోజుకు వేడుకగా సాగడంతో భక్తులు ఉత్సవాలను వీక్షించి తరిస్తున్నారు. ఏడో రోజైన గురువారం ఐశ్వర్యలక్ష్మిగా అమ్మవారు కనిపించడంతో పరవశించిపోయారు. మమ్ము గన్న మా తల్లి అష్టైశ్వర్యాలను అందించు అంటూ ప్రణమిల్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి భజన కీర్తనలు పాడి మురిసిపోయారు. లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఐశ్వర్యలక్ష్మిని వేంచేయింప చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన కొనసాగించారు. 'ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మ. కరుణా రూపిణి అయిన ఈ అమ్మవారి క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడు' అని వైదిక పెద్దలు ప్రవచించారు. ఈ రూపంలో అమ్మను ఆరాధిస్తే శాసకత్వం, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని శాస్త్రం. రామాయణ పారాయణం భక్తిప్రపత్తులను పెంచింది. శుక్రవారం వీరలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు.

☆ భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ మాడవీధులన్నీ గురువారం రామనామాలతో మార్మోగాయి. ఆలయం తలుపులు తెరిచిన తర్వాత అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించారు. బేడా మండపంలో క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచనం చేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనుణ్ని పూజించి పుణ్యాహవాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ నయనానందంగా మారింది. చల్లని రామయ్యకు చక్కని సీతమ్మకు ఘనంగా తలంబ్రాల వేడుక చేశారు. దర్బారు సేవలో స్వామి వైభవం మరింత పెరిగింది. శుక్రవారం బంగారు కవచాల అలంకారంలో రామయ్య దర్శనం ఉంటుందని వైదిక పెద్దలు తెలిపారు.



ఐశ్వర్య లక్ష్మి అలంకారంలో అమ్మవారి దర్శనం



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కాలువే.. నీరు పారుతుందనుకునేరు!

ఈ చిత్రం చూస్తుంటే కాలువలో నీరు పారుతుందనుకుంటే మీరు పొరపడినట్లే. ఇది సీతారామ ప్రాజెక్టు ఆఖరి (16వ) ప్యాకేజీ పరిధిలో కూసుమంచి రెవెన్యూ పరిధిలో తవ్విన పాలేరు లింక్ కెనాల్. కాల్వకు ఒక వైపున సొరంగం తవ్వకం పనులు సాగుతుండగా.. మరో వైపున పనులు పూర్తి కాలేదు. వర్షాలకు వచ్చిన వరద నీరు కాల్వ నిండా చేరి ఇలా కన్పిస్తోంది. కాల్వ, ప్రాజెక్టు పనులు పూర్తయితే గోదావరి నుంచి నీరు పాలేరు జలాశయానికి చేరుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

– కూసుమంచి, న్యూస్‌టుడే



యువకుడి అదృశ్యం

ఖమ్మం నేరవిభాగం: హైదరాబాద్ వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటనపై ఖమ్మం ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. నగర శివారు కొత్తగూడేనికి చెందిన ములకలపల్లి రాజేశ్(30) సెప్టెంబరు 17న హైదరాబాద్ వెళ్లి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆపై అతని చరవాణి స్విచ్ఛాఫ్ వస్తోంది. నాటి నుంచి అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.

డిక్కీలో సరకులు సర్దుతున్నంతలోనే..
ముందు సీట్లోని బంగారం సంచి మాయం

చుంచుపల్లి, న్యూస్‌టుడే: కారు ముందు సీట్లో ఉంచిన బంగారు ఆభరణాల సంచిని ఆటోలో వచ్చిన దొంగ చాకచక్యంగా దొంగిలించాడు. బాధితుడు వాహనం డిక్కీలో సరకులు సర్దుతున్నంతలోనే కళ్లుగప్పి చేతివాటాన్ని ప్రదర్శించాడు. ఈ ఘటన చుంచుపల్లి మండలంలో చోటుచేసుకొంది. ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం.. కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి వి.వెంకటేశ్వరరావు కొత్తగూడెం పోస్టాఫీస్ ఏరియాలోని బ్యాంకుకు గురువారం వచ్చారు. లాకర్‌లో దాచిపెట్టిన 19 తులాల బంగారాన్ని డ్రా చేసుకున్నారు. అక్కడ్నుంచి విద్యానగర్‌లోని ఓ సూపర్ మార్కెట్ వద్ద ఆగారు. అక్కడ కొన్న సరకులను కారు డిక్కీలో సర్దుకొంటున్నారు. సరిగ్గా అదే సమయంలో ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వరరావు కళ్లుగప్పి.. కారు ముందు డోరును చాకచక్యంగా తెరిచి బంగారు ఆభరణాల కవర్‌ను తస్కరించాడు. క్షణాల్లో అక్కడ్నుంచి మాయమయ్యాడు. డ్రైవర్ సీట్లో కూర్చునేందుకు వచ్చిన బాధితుడు బంగారం మాయమైందని గ్రహించి వెంటనే చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రవి కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పలు వివరాలు సేకరించారు. బ్యాంకు నుంచే వెంకటేశ్వరరావును దొంగ గమనించి చోరీకి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	6,000	6,900	6,700
పాతపత్తి	7,000	7,400	7,300
పెసలు	6,600	7,300	6,775
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	10,000	19,700	16,400
ఎండుమిరప	9,500	18,600	17,200

దసరా తర్వాతే పత్తి కొనుగోళ్లు

ఈ ఏడాదీ ప్రైవేటు యార్డులోనే..

జూలూరుపాడు, న్యూస్‌టుడే

జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం ఎట్టకేలకు పదెకరాల స్థలం కేటాయించి మార్కెటింగ్‌శాఖకు అప్పగించింది. మార్కెటింగ్ శాఖ అధికారులు ఇటీవల సరిహద్దులను గుర్తించి రాళ్లు పాతారు. జూలూరుపాడులో ఉప మార్కెట్ యార్డు 20 ఏళ్లుగా ప్రైవేటు స్థలంలోనే కొనసాగుతోంది. ఏన్కూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాల విభజన అనంతరం ఈ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా మార్చాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈనేపథ్యంలో జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని శాశ్వత మార్కెట్ నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధుల కేటాయింపు తదితర అంశాలు పరిశీలనలో ఉన్నాయి. ఈ ఏడాది కూడా ప్రైవేటు స్థలంలోనే పత్తి కొనుగోళ్లు జరపాలని అధికారులు నిర్ణయించారు.



జూలూరుపాడులో పత్తి క్రయవిక్రయాలు (పాత చిత్రం)

ఆదాయం ఘనం.. అవస్థలూ అధికం

జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో ఏటా రూ.20కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. మార్కెట్ కమిటీకి రూ.2కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ప్రైవేటు స్థలంలో అసౌకర్యాల నడుమ రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కేటాయించిన స్థలంలో ఇప్పట్లో శాశ్వత నిర్మాణ పనులు చేపట్టే అవకాశం లేదు. ప్రైవేటు స్థలంలో సరైన భద్రత సౌకర్యాలు లేవు. అగ్ని ప్రమాదాలు సంభవించినా, అధిక వర్షాలు కురిసినా మార్కెట్‌కు వచ్చిన సరకును రక్షించుకోలేని పరిస్థితి. అంతేకాకుండా రైతులకు విశ్రాంతి తీసుకునే అవకాశం లేదు. మండుటెండల్లోనే మగ్గాల్సి ఉంటుంది. హమాలీలు భోజనాలు చేసేందుకు అవస్థలు పడుతున్నారు. వీటన్నింటినీ అధిగమించేందుకు శాశ్వత మార్కెట్ పనులు త్వరితగతిన ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో..

దసరా పండగ తరువాత జూలూరుపాడు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో పత్తి తీసేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీపావళి నాటికి మార్కెట్‌కు పత్తి విరివిగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. జూలూరుపాడులోని ఉప మార్కెట్ యార్డుకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి పత్తిని తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వచ్చే మార్చి వరకు ఇక్కడ పత్తి క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇక్కడి నుంచే ఆదిలాబాద్, గుంటూరు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని మార్కెట్లకు సైతం వ్యాపారులు పత్తిని ఎగుమతి చేస్తుంటారు.

ఏన్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోనే ఈ ఏడాది కూడా పత్తి కొనుగోళ్లు చేపడతాం. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం అప్పగించింది. ఇటీవల ఆ స్థలానికి హద్దులు గుర్తించాం. ఇక్కడ పనులు చేపట్టేందుకు కొంత సమయం పట్టవచ్చు. అప్పటివరకు ప్రైవేటు స్థలంలోనే దసరా పండగ తరువాత పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

- బజారు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, ఏన్కూరు

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మర్కోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-2014 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులంతా వారు చదువుకున్న జడ్పీ పాఠశాలలో కలిసి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఈ కార్యక్రమంలో విజయ్, రాము, ఉదయ్, అరవింద్, శ్రీనాథ్, అశోక్, సందీప్, సత్యనారాయణ, ప్రవళిక, అనిత, కవిత, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

'భారాస హయాంలోనే సువర్ణాధ్యాయం'

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం సాగు, విస్తరణకు భారాస పాలనలో సువర్ణాధ్యాయం నడిచిందని మాజీ శాసనసభ్యుడు మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో నూతనంగా రూ.36కోట్లతో నిర్మించిన టర్బైన్, పామాయిల్ పరిశ్రమను భారాస అనుచరులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో అప్పారావుపేటలో ఆధునిక పామాయిల్ పరిశ్రమను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే రూ.100 కోట్లతో నిర్మించారు, అశ్వారావుపేట పరిశ్రమను 15టన్నుల నుంచి 30టన్నులకు విస్తరించినట్లు వివరించారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జుజ్జూరు వెంకన్నబాబు, సంపూర్ణ, సూరిబాబు, మోహన్, యుగంధర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు మణుగూరు గ్రంథాలయానికి మోక్షం



మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన శాఖ గ్రంథాలయం ఎట్టకేలకు నేడు(శుక్రవారం) ప్రారంభం కానుంది. గత ఏడాది ఈ నిర్మాణం పూర్తి చేసిన విషయం తెలిసిందే. గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్‌సీఏ నుంచి ఈ నిధులు కేటాయించారు. మంజూరైన నిధులతో పలు రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్, స్టేషనరీ, బల్లలు, కుర్చీలు, పుస్తకాల ర్యాక్, ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ విషయమై తహసీల్దారు రాఘవరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. . పుస్తక పఠనంపై అభిరుచి ఉన్న వారితోపాటు స్థానిక యువత కోసం ఈ గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు.

ఆయిల్‌పాం కర్మాగారం ప్రారంభోత్సవానికి రావాలని మంత్రికి ఆహ్వానం

దమ్మపేట, న్యూస్‌టుడే: ఈ నెల 12న అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారంలో నిర్వహించే పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆహ్వానించారు. మండలంలోని గండుగులపల్లిలో ఎమ్మెల్యే గురువారం అధికారులు, రైతులతో కలిసి మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర ఆయిల్‌పాం సలహామండలి సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, సాంకేతిక విభాగ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, అచ్యుతరావు, సత్యనారాయణ, నాగప్రసాద్ పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే ఆదినారాయణ, తదితరులు

పోలీసుల విస్తృత తనిఖీలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో పోలీసులు జాగిలాలతో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవలికాలంలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా పెరిగిపోవడంతో భద్రాచలం సరిహద్దు విభాగాల్లో నిఘా పెంచారు. మరో వైపు పట్టణంలో ట్రాక్టర్ల యజమానులు సైతం ఇష్టానుసారం అక్రమంగా అనధికారికంగా రాత్రిపూట పట్టణంలోకి ఇసుక తోలకాలు సాగిస్తున్నారు. దీనిపై పట్టణ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్యలు లేకపోవడంతో అనధికారికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న తీరుపై నిఘా వర్గాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకొని జరిమానా విధించారు.



కారులో తనిఖీ చేస్తున్న జాగిలం

కష్టాలు ఎదురైనా.. లక్ష్యాన్ని సాధించి..

అశ్వారావుపేట గ్రామీణం, దమ్మపేట, న్యూస్‌టుడే



కష్టాలు ఎదురైనా.. కుటుంబ బాధ్యతలు భుజాలపై ఉన్నా.. లక్ష్యానికి ఇవేవీ అడ్డుకాదని నిరూపించారు. కష్టాలు మాతోనే పోవాలన్న పట్టుదలతో చదివి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తాజాగా వెలువడిన డీఎస్సీ 2024 ఫలితాల్లో మండలంలోని గ్రామీణ ప్రాంత అభ్యర్థులు పలువురు ఉపాధ్యాయ కొలువులు పొందారు. దమ్మపేటకు చెందిన ముగ్గురు విద్యార్థులు.. వైద్యులు కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి వైద్య విద్యలో సీట్లు సాధించారు.

అమ్మకే అమ్మగా..



ఆసుపాక గ్రామానికి చెందిన తుర్రం రాణి ఏడాది వయసులోనే తండ్రి సింగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి తల్లి లక్ష్మి అన్నీ తానై కుమారుడు, కుమార్తెను చదివించారు. 2012-14లో రాణి డీఎడ్ పూర్తిచేసింది. ఆ సమయంలో తల్లి పక్షవాతం బారిన పడటంతో అమ్మలా సేవలు చేస్తూనే ఇంటి వద్దే ఉంటూ 2018 డీఎస్సీ రాసినా ఫలితం లేకపోయింది. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా చదివి ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు.

తల్లిదండ్రుల సంతోషం



దమ్మపేటకు చెందిన తిలక్‌భరత్ జనరల్ కోటాలో సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలలో సీటు సాధించారు. శిక్షణలో ఏ మాత్రం పట్టుసడలకుండా తన లక్ష్యాన్ని అందుకున్నారు. తల్లి గృహిణి. తండ్రి శ్రీనివాస్ దమ్మపేటలో ఓ మెడికల్ స్టోర్ నడుపుతున్నారు. కుమారుడు సీటు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



వీరితో పాటు మరికొందరు.. ఆసుపాక నుంచి గిరిజన యువకుడు మడకం రాంబాబు, లాకవత్ దివ్య, గంగాధర్, వినాయకపురానికి చెందిన రొయ్యల గణేశ్, తిరుమలకుంటకు చెందిన మణిరత్నం, గుమ్మడవల్లికి చెందిన దైదా శిరీషలు ఉపాధ్యాయులుగా ఎంపికై ధ్రువపత్రాలు అందుకున్నారు.

శిక్షణ లేకుండానే..



గుమ్మడవల్లికి చెందిన తన్నీరు వేణు నిరుపేద. తండ్రి లక్ష్మయ్య తాపీ పనులు చేస్తూ కుమారుడిని చదివించారు. 2015-17లో డీఎడ్ చేసి అదే ఏడాది వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలున్నారు. భార్యాపిల్లలను పోషించేందుకు సిమెంటు వరలను తయారు చేస్తూనే కొలువు సాధించాలనే లక్ష్యంతో చదివి ఎస్జీటీ కొలువు సాధించారు.



ఉపాధ్యాయుల కుమార్తె.. దమ్మపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు అత్తిలి శ్రీనివాసరావు, నాగమణి దంపతుల కుమార్తె బేబిసాహితీ హైదరాబాద్‌లోని అరుంధతి వైద్య కళాశాలలో సీటు సాధించారు. కుమార్తె వైద్య విద్య ప్రవేశం కోసం తల్లిదండ్రులు తీవ్ర పోరాటం చేశారు. స్థానికత అంశంలో సుప్రీం కోర్టు జోక్యంతో వారి కల నెరవేరింది.

తల్లికి సేవ చేస్తూనే..



వినాయకపురానికి చెందిన మహ్మద్ చాంద్ పాషా తండ్రి హుస్సేన్ చిన్న హోటల్ నిర్వహించేవారు. డీఎడ్ చదువుతున్న సమయంలో 2017లో తండ్రి మృతి చెందారు. తల్లి అసీనా పక్షవాతంతో మంచం పట్టింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఓ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తూనే పట్టుదలతో చదివి బీసీఈ కేటగిరీలో జిల్లా స్థాయిలో 28వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు.

మానాన్న ఇబ్బందులను చూసి



మామిళ్లవారిగూడేనికి చెందిన కౌలూరి అనిత తండ్రి వెంకటేశ్వర్లు ఆ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూనే కుమార్తెను చదివించారు. 2015-17లో డీఎడ్ చేసిన తర్వాత డిగ్రీ, బీఈడీ కూడా చేశారు. తండ్రి కష్టాన్ని చూసిన తాను ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. జిల్లా స్థాయిలో ఎస్జీటీలో 38వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు.



భర్త సహకారంతో.. వినాయకపురానికి చెందిన అచ్చే శృతి 2015-17లో డీఎడ్ పూర్తిచేశారు. ఆ తర్వాత డిగ్రీ చేశారు. 2021లో అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో వివాహమైంది. ప్రస్తుతం ఈమెకు ఇద్దరు కుమార్తెలు. ఇంటి పనులు చేస్తూనే. . సొంతంగా నోట్స్ తయారు చేసుకుని భర్త, తన తల్లిదండ్రులు విశ్వేశ్వరరావు, లక్ష్మిల ప్రోత్సాహంతో కష్టపడి చదివారు. ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 'బీసీ బీ' కేటగిరీలో 19వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయినిగా నియామకపత్రం అందుకున్నారు.

వైద్యురాలిగా చూడాలని..



దమ్మపేటకు చెందిన గాంధంశెట్టి వెంకటేశ్వరరావు కుమార్తె కావ్య జనరల్ కోటాలో హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రవేశం పొందారు. చిన్నతనం నుంచి చదువులో కావ్య చక్కని ప్రతిభ కనబరుస్తోంది. కుమార్తెను వైద్యురాలిగా చూడాలనే తల్లిదండ్రుల కోరికను నెరవేర్చడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తల్లి గృహిణి కాగా తండ్రి దమ్మపేటలో గృహోపకరణాల దుకాణం నడుపుతున్నారు.

పొలం ఎండకుండా.. డీజిల్ ఇంజిన్ ఏర్పాటు



ఈయన అశ్వాపురం మండలం కల్యాణపురం గ్రామానికి చెందిన రైతు సేవ్య. ప్రధాన రహదారికి సమీపంలో ఒక ఎకరం వరి పొలం ఉంది. వానలు వెనక్కు వెళ్లడంతో పంటకు సాగునీరు కష్టమవుతోంది. దీంతో తోగ్గూడెం సమీప కల్వర్టు కింద నుంచి పారుతున్న సీతారామ గండి చెరువు కాలువలో కొన్ని నీళ్లు ఉన్నాయి. అక్కడి నుంచి ఆయన పొలం సుమారు అర కిలోమీటరు దూరంలో ఉంటుంది. అక్కడ డీజిల్ ఇంజిన్ పెట్టి అర కిలోమీటరు వరకు పైపులను ఏర్పాటు చేసి ఉన్న కొద్దిపాటి ఆ నీళ్లను తన పొలానికి పారించుకుంటున్నారు. బాగా ఎండిపోయి ఉండటంతో 10 గంటలు పారిస్తే తప్ప తన పొలం తడవదంటున్నారు. గంటకు లీటర్ డీజిల్ కాలుతోంది. ఇంజిన్, పైపులు కూడా అద్దెవే. వెరసీ ఆయనకు రోజుకు రూ.2 వేలకుపైగా ఖర్చవుతోంది. – అశ్వాపురం, న్యూస్‌టుడే

విటమిన్-డి కోసమే..



వీరంతా స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద చిన్న పిల్లలని ఎత్తుకొని ఎండలో నిలబడ్డారేంటీ అని ఆలోచిస్తున్నారా? ఇది చిన్నారులకు విటమిన్-డి అందడం కోసమేనట. వైద్యుల సూచనల మేరకు అపుడే పుట్టిన చిన్నారులకు సూర్యరశ్మి తగిలేలా ఉంచాలని వైద్యుల సూచించడంతో ఉదయం పూట ఆసుపత్రి వద్ద వారి బంధువులు ఇలా చిన్నారులను ఎత్తుకుని నిలబడ్డారు. – భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

ఉపకరణాల అందజేతకు దివ్యాంగుల ఎంపిక

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక కార్యక్రమం భద్రాచలం ఎంపీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించారు. ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) సహకారంతో దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రైసైకిళ్లు, వీల్‌ఛైర్స్, అంధులకు చేతి కర్రలు, కృత్రియ అవయవాలు, చంక కర్రలు అందించనున్నారు. భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరు కాగా వారిలో 126 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిబ్బంది రష్మీ రంజాన్‌శెట్టి, అభిషేక్ ద్వివేది అధికారులు నవ్యశ్రీ, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది సౌమ్య, అనసూయ, రాజేశ్వరీ, వరప్రసాద్, నరేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్న అలింకో ప్రతినిధులు

ఎస్సైకి అభినందనలు



ఎస్సై స్వప్నని అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

చంద్రుగొండ, న్యూస్‌టుడే: వరంగల్‌లో నిర్వహించిన డ్యూటీమీట్‌లో రాష్ట్రస్థాయిలో రెండు రజత పతకాలు సాధించిన చంద్రుగొండ ఎస్సై గంజి స్వప్నని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, అడిషనల్ ఎస్పీ మల్లయ్యస్వామి గురువారం అభినందించారు. విధి నిర్వహణలో చురుకుగా పనిచేయాలని సూచించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామచంద్రాపురంలో శాఖ మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పెట్రో ధరలను తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు కోట్లాది రూపాయలు దోచిపెడుతోందని ఆరోపించారు. నాయకులు అచ్చిరాజు, బాబు, మల్లూరు, కనక, రాజేష్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడులోని గౌతాపురంకాలనీకి చెందిన పున్నమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రూ.4 వేలు అందించారు. ట్రస్టు ఛైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్‌ఛైర్మన్ కె.నాగిరెడ్డి, మల్లారెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ హక్కుపత్రాలు పంపిణీ చేయండి

ములకలపల్లి, న్యూస్‌టుడే: మండలానికి చెందిన పోడు సాగుదారులు భద్రాచలంలో హక్కు పత్రాలు అందుకోవడంతో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరీ నాగేశ్వరరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన పోడు రైతులకు హక్కు పత్రాలు లభించే వరకు ఉద్యమాలు చేపడతామని తెలిపారు. లక్ష్మి, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

'సమష్టి కృషితో లక్ష్యాలను సులువుగా సాధించవచ్చు'



కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న జీఎం దుర్గం రామచందర్

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సునాయాసంగా సాధించవచ్చని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. సింగరేణి 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏరియా వర్క్‌షాపులో ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గం రామచందర్ మాట్లాడారు. అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసు, రమేశ్, అనురాధ, రామకృష్ణ, శ్రీనివాసు, రాంగోపాల్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆటో అపహరణపై కేసు నమోదు

చర్ల, న్యూస్‌టుడే: కుదునూరులో ఇంటి ముందు పెట్టిన ఎడారి సాయికిరణ్ అనే వ్యక్తి ఆటోను ఈనెల 4వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో ఆటో యజమాని సాయికిరణ్ గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

ఆదివాసీ రైతులకు పోడు పట్టాలు: టీఏజీఎస్



ఐటీడీఏ ఎదుట పోడు పట్టాలతో గిరిజన రైతుల ప్రదర్శన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పోరాట ఫలితమే 91 మంది గిరిజన రైతులకు పోడుపట్టాలు అందాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఇచ్చిన పోడు పట్టాలతో స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట గురువారం ప్రదర్శన నిర్వహించి పీఓకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ములకలపల్లి మండలం మంగలిగుట్ట, తిమ్మంపేట గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజన రైతులు 91 మందికి 291 ఎకరాల భూమి పట్టాలు పీఓ పంపిణీ చేశారని ఆయన పేర్కొన్నారు. అదే భూములకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని పీఓను కోరారు. మాజీ సర్పంచి గౌరి లక్ష్మి, సుధాకర్, శోభన్‌బాబు, కళ, సుమక్క, ప్రసాద్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి

అశ్వాపురం, న్యూస్‌టుడే: టాటా గ్రూప్ సంస్థల అధినేత రతన్ టాటాకు అశ్వాపురం మండలం మొండికుంటలో గురువారం ఘనంగా నివాళి అర్పించారు. గ్రామానికి చెందిన మెకానిక్ రాము, బేకర్ కృష్ణారెడ్డి, దొంతుల చంద్రశేఖర్ తదితరులు రతన్ టాటా చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీని వారి దుకాణాల వద్ద ఏర్పాటు చేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.



మొండికుంటలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఫ్లెక్సీ

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



దోమతెరలు అందిస్తున్న ఎస్సై, ఫౌండేషన్ సభ్యుడు

కరకగూడెం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపారు. గురువారం పద్మాపురం పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన నీలాద్రిపేటలో ఆ గ్రామస్థులకు ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో కరకగూడెం గ్రామీణ వైద్యుడు షేక్ సోందుపాషా సమక్షంలో 70 మందికి దోమతెరలు అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు సోందుపాషా మాట్లాడుతూ... పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్ యాకుబ్ ఖాన్, ఈసం రాజబాబు, ఫౌండేషన్ సభ్యులు షేక్ వసీం అక్రం, సమీర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షలతో దైవరథం ఏర్పాటు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఐటీసీ ఉద్యోగులు రూ.2.50 లక్షల వ్యయంతో దైవరథం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఉపయోగించడానికి అవసరమైన దైవరథాన్ని తయారు చేయించారు. నూతనంగా తయారు చేయించిన రథాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఐటీసీ ఉద్యోగులు గతంలోనూ పలు కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి అవసరమైన రథాన్ని తయారు చేయించిన ఉద్యోగులను స్థానికులు అభినందించారు.



దైవరథాన్ని ప్రారంభిస్తున్న ఐటీసీ ఉద్యోగులు

బతుకమ్మ వేడుకలు



మొండికుంటలో సద్దుల బతుకమ్మ వేడుకలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో పలు చోట్ల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ రమాదేవి పాల్గొని బతకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకల్లో పాల్గొన్న మహిళల్లో ఉత్తేజాన్ని నింపారు.

గుండాల, పినపాక, అశ్వాపురం, ఆళ్లపల్లి, మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుండాల మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలు చేస్తూ బతుకమ్మ పాటలు పాడుకుంటూ నృత్యాలు చేశారు. ★ మణుగూరు, పినపాక, అశ్వాపురం, ఆళ్లపల్లి మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే పూలసేకరణకు వెళ్లిన మహిళలు అమ్మవారికి ప్రీతికరమైన పూలను సేకరించారు. పలువురు అల్లి, టేకుపూలతో బతుకమ్మను అందంగా అలంకరించారు. గద్దెల వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు.

చర్ల, న్యూస్‌టుడే: పల్లె పల్లెనా.. వాడవాడలా పూల పండుగను మహిళలు వైభవంగా జరుపుకున్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలు చివరి రోజు గురువారం అట్టహాసంగా జరిగాయి.

చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురంలో విజేతలకు బహుమతులు అందజేశారు.



మణుగూరు పూజారినగర్‌లో..



ఆర్.కొత్తగూడెంలో..

దుర్గమ్మకు పూజలు

మణుగూరు సాంస్కృతికం, పినపాక, బూర్గంపాడు, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మణుగూరులోని పలు అమ్మవారి ఆలయాల్లో గురువారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

★ బూర్గంపాడు మండలంలోని సాకేతపురి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం సుందరకాండ, లలితా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: పర్ణశాల రామాలయంలో ఐశ్వర్యలక్ష్మీ అవతారంలో, లక్ష్మీనగరం, సీతారాంపురం, నడికుడి ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవి అవతారంలో అలంకరించారు. అర్చకులు భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, రాఘవశర్మ, రాజగోపాలాచార్యులు, ఆలయ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

★ చర్ల మండలం మొగళ్లపల్లిలోని విజయరామ మందిరంలో జరుగుతున్న ఉత్సవాల్లో గురువారం అమ్మవారు కనకదుర్గమ్మ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వామి సత్యనారాయణమూర్తి నేతృత్వంలో విశేష పూజలు జరిగాయి.



పోతురెడ్డిపల్లిలో అమ్మవారు



అశ్వారావుపేట: దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాలు, దసరా పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ఉత్సవాలు నిర్వహించారు.

దమ్మపేట, న్యూస్‌టుడే: నవరాత్రోత్సవాల్లో భాగంగా పెద్దబజార్‌లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాచారం శ్రీ జయలింగేశ్వరస్వామి, వడ్లగూడెం శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి. నాగుపల్లి శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

అశ్వారావుపేట గ్రామీణం: పలు గ్రామాల్లో దేవీనవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీరంగాపురంలోని శ్రీవిజయదుర్గా అమ్మవారి ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మించిన రైతు బండి పుల్లారావు 20 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం, కనకదుర్గా అమ్మవారి, శ్రీరంగపురం విజయదుర్గా, గుర్రాలచెరువు స్వయంభూ కనకదుర్గ, రామాలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించారు.

కొత్తగూడెం
•కొత్తగూడెం • ఇల్లెందు

మార్క్స్ సిద్ధాంతాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సోమయ్య.. పక్కన రమేష్, కనకయ్య తదితరులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కమ్యూనిస్టులు మార్క్స్ సిద్ధాంతాలు, ఆశయాలను అవగతం చేసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య అన్నారు. మార్క్సిస్టు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. పెట్టుబడిదారి దేశాల్లోని కార్మిక పోరాటాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, మచ్చా వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, శ్రీనివాస్, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ కుమారుడు సాయిసాత్విక్ పుట్టిన రోజును పురస్కరించుకుని సత్యసాయి సమాజ సేవా ట్రస్టు అనాథాశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. సొసైటీ కార్యదర్శి సునీల్‌కుమార్, సంయుక్త కోశాధికారి వై.కాంతారావు, కాంగ్రెస్ నాయకుడు కనకరాజు, బీఎంఎస్ నాయకుడు మాధవనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ గట్టాయిగూడెం కాలనీలో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. డ్రైనేజీ పక్కనే పిచ్చిమొక్కలు పెరిగాయి. **- రమణ, స్థానికుడు**

సమాధానం: ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం.
- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
- పాల్వంచ, న్యూస్‌టుడే

17న ఆర్టిజన్ల సమస్యలపై మహాధర్నా

పాల్వంచ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని ఆర్టిజన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్ అన్నారు. పాల్వంచ సీపీఐ కార్యాలయంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ భారాస హయాంలో కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా మార్చి వదిలేశారన్నారు. రెగ్యులర్ కన్వర్షన్, ఇతర సమస్యల సాధనే లక్ష్యంగా ఈ నెల 17న వరంగల్‌లో మహాధర్నా తలపెట్టినట్లు చెప్పారు. నాయకులు శంకర్, కృష్ణ, శారద, వెంకటరావు, రాములు, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టిజన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్

మినీ మైసూరు వేడుకలకు వేళాయె!

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

సింగరేణి పుట్టినిల్లు ఇల్లెందులో విజయ దశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. కర్ణాటకలోని మైసూరు తరహాలో రాష్ట్రంలోనే ప్రత్యేకంగా బొగ్గుట్టలో దసరా వేడుకలు ఏటా జరుగుతాయి. రాష్ట్రమంతటా వివిధ రూపాల్లో కొలువుదీరే దుర్గామాతను పూజిస్తారు. బొగ్గుట్టలో ఇందుకు భిన్నంగా ప్రధాన ఆలయాల్లో పూజలందుకునే దేవతా ప్రతిమలను అలంకరించి రథాలపై (దేవతామూర్తుల శావ) ఊరేగిస్తారు.

బ్రిటీషు కాలం నాటి ఓ భవనానికి అనుబంధంగా నిర్మించిన ఇల్లెందు పట్టణంలో నం.2 బస్తీలోని శ్రీకృష్ణ భజనమందిరం నుంచి ఏడు దశాబ్దాలుగా దసరా వేడుకల్లో విగ్రహ ఊరేగింపు సంప్రదాయం కొనసాగుతోంది. వివిధ రూపాల్లో కొలువై ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించి వేడుకలు జరిగే జమ్మి స్థలం (విజయ దశమి వేడుకలు జరిగే స్థలం) వద్దకు చేర్చుతారు. అక్కడ భక్తులు స్వామివారిని కనులారా దర్శించుకుంటారు. ఉత్సవాలు ముగియగానే రథం ప్రతిమతో సహా తిరిగి ఆలయానికి చేరుతుంది. ఇల్లెందులపాడులోని శ్రీరామ భజనమందిరం ఆలయం నుంచీ ఏటా ఓ దేవతా మూర్తి విగ్రహాన్ని వేడుకకు తరలిస్తున్నారు. ఈ సారి అయోధ్య బాలరాముని ప్రతిమను రథంపై ఊరేగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో శివుడు, షిర్డి సాయిబాబా ఇతర దేవతల విగ్రహాలను కొలువుదీర్చారు. వీటితో పాటు శరన్నవ రాత్రుల సందర్భంగా పట్టణంలోని పుర వీధుల్లో వివిధ మండపాల్లో పూజలందుకునే దుర్గమ్మ తల్లి ప్రతిమలను జమ్మి స్థలానికి తీసుకొస్తారు. వేడుకల అనంతరం సమీప ఘాట్‌కు నిమజ్జనానికి తరలిస్తారు. ఇంతకు ముందు మిషన్ స్కూల్ ప్రాంగణంలో స్థానిక పురపాలక వర్గం ఆధ్వర్యంలో దసరా వేడుకలు జరిగేవి. గతేడాది నుంచి జేకే కాలనీలోని సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో సంబరాలు నిర్వహిస్తున్నారు.


శ్రీకృష్ణ భజనమందిరం నుంచి ఉత్సవాలకు తరలుతున్న విగ్రహం (పాతచిత్రం)

ప్రముఖుల సందడే సందడి..

మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు స్థానిక వేడుకల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. గత 30 ఏళ్లుగా వేడుకల ప్రాంతాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. సాంస్కృతిక, సినీ సంగీత విభావరి, మిమిక్రీ ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు. 2013 నుంచి 'రావణ వధ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈటీవీ జబర్దస్త్ కళాకారుల బృందం తమ హాస్యవల్లరితో అలరించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

★ 'దసరా ఉత్సవాలకు ఇల్లెందులో మరో మైసూరు తరహాలో నిర్వహించేలా పురపాలకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాం. వేడుకలు ప్రశాంతంగా జరుపుకొనేందుకు అన్ని శాఖల అధికారులు, భక్తులు సహకరించాలి' అని పురపాలక ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు


ఓ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌నాయక్

చుంచుపల్లి, కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులకు అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు ఉండాలని జిల్లా వైద్య శాఖాధికారి డా.భాస్కర్ నాయక్ సూచించారు. చుంచుపల్లి మండలంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల అనుమతులు, సిబ్బంది అర్హతలు, నిబంధనల అమలు, అందిస్తున్న సేవలను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డా.మధువన్, డిప్యూటీ డెమో ఫైజ్‌మొహియుదద్దీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాలీలో బండి..



పండగ రోజులు కావడంతో చిన్న ట్రాలీ తీసుకుని ఓ కుటుంబం ఊరికి బయలు దేరింది. సామగ్రితోపాటు కుటుంబ సభ్యులు దానిలో కూర్చున్నారు. ద్విచక్రవాహనం పట్టేంత స్థలం కూడా ఉండటంతో దానిపై వెళ్తే ఖర్చవుతుందని అనుకున్నారేమో, ఇలా పనిలో పనిగా ఆ బండిని కూడా వ్యానులోనే ఎక్కించి ఎంచక్కా దానిపైనే కూర్చొని ఇలా ఓ వ్యక్తి ప్రయాణించాడు. జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్‌రోడ్ వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. **– జూలూరుపాడు, న్యూస్‌టుడే**

'మద్యం వ్యసనంతో కుటుంబాలు విచ్ఛిన్నం'

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలు, తండాల్లో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచి చీప్ లిక్కర్‌ను వాహనాల్లో గొలుసు కట్టు దుకాణాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారని బంజారా గిరిజన హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. దీంతో మద్యానికి జనం బానిసలుగా మారి ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయన్నారు. అధికారులు మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సంఘం నాయకులు వాంకుడోతు హతీరాం, భూక్యా బాలాజీ నాయక్‌లు కొత్తగూడెంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో డిమాండ్ చేశారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కోరం


రాంబాబుకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. సంస్థ భవిష్యత్తు కార్యక్రమాలు, ప్రణాళికలు కార్మికులకు సంస్థ అందించే సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇల్లెందు సింగరేణి జేకే 5 ఉపరితల గని ఆవరణలో జీఎం జాన్ ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ద్వారా అవగాహన కల్పించడమే కాకుండా కార్మికులకు సహపంక్తి భోజనాలు నిర్వహించడం హర్షణీయమని వివరించారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, శివప్రసాద్, గిరిధర్‌రావు, కృష్ణ, మోహన్‌రావు, రవికుమార్, నాయకులు సారయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ★ ఇల్లెందు మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని మాణిక్యారానికి చెందిన బానోతు రాంబాబు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే కనకయ్య అభినందించి నియామకపత్రం అందజేశారు. కిన్నెర నర్సయ్య, రోజా, చెన్నూరి కృష్ణ, శ్రీను, వెంకట్రావు, ఉపేందర్ పాల్గొన్నారు.

'108'లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

కొత్తగూడెం పట్టణం: గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో అత్యవసర వాహనంలోనే కాన్పు జరిగింది. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక పంచాయతీ చింతపెంట గూడెం గ్రామానికి చెందిన చాటి శాంత (32)కి పురిటి నొప్పులు వస్తుండటంతో స్థానికులు 108కు గురువారం సమాచారమిచ్చారు. ఈఎంటీ రాధ, పైలట్ రామారావులు గ్రామానికి చేరుకుని శాంతను రామవరం ఎంసీహెచ్‌కు తరలిస్తున్నారు. మార్గంమధ్యలో రేగళ్ల వద్ద నొప్పులు అధికమవడంతో వాహన సిబ్బంది కాన్పు చేయగా మగ శిశువు జన్మించాడు. ప్రాథమిక చికిత్స నిమిత్తం తల్లీబిడ్డలను ఎంసీహెచ్‌లో చేర్పించారు.

లాభదాయక సాగు పద్ధతులు అలవర్చుకోండి


వెంకట్యాతండాలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

టేకులపల్లి, న్యూస్‌టుడే: రైతులు లాభదాయక సాగు పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. వెంకట్యాతండా, బేతంపూడి గ్రామాల్లో రైతులను కలిసి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మొక్కజొన్న, పత్తి, మిర్చి వంటి సాగుతో పాటుగా మునగ, చేపల పెంపకం, తేనెటీగలు, పుట్టగొడుగులు, అజోల్లా వంటివి చేపట్టాలని వివరించారు. రైతులు వరిపొలంతో పాటుగా సమీపంలో నీటికుంట, నీటికుంటలో బాతులు పెంచుకోవాలని పేర్కొన్నారు. బేతంపూడిలో బచ్చలకూర అశోక్ వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. లాభసాటి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న అశోక్‌ను అభినందించారు. ఎంపీడీఓ రవీందర్‌రావు, ఏఓ అన్నపూర్ణ, ఎంపీఓ గణేశ్‌గాంధీ, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రుద్రంపూర్' ఆటోడ్రైవర్లకు ఎస్పీ కౌన్సెలింగ్?

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: రుద్రంపూర్‌లో చోటుచేసుకున్న 'ఆటో సీరియల్' వివాదం, అనంతర పరిస్థితులపై ఎస్పీ బి.రోహిత్‌రాజు ఆరా తీశారు. పట్టణంలోని గౌతంపూర్, రుద్రంపూర్ ఏరియాల్లో ఆటో సీరియల్ విషయమై తరచూ ఆటోవాలాల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవల ఓ డ్రైవర్‌ను మరో ఇద్దరు బెదిరించగా.. బాధితుడు స్థానిక రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సమస్యపై 'రుద్రంపూర్‌లో ఆటో సీరియల్ జగడం' శీర్షికన 'ఈనాడు'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎస్పీ బి.రోహిత్‌రాజు రుద్రంపూర్‌కు చెందిన ఆటో అడ్డా బాధ్యులు కొందరిని తన కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రయాణికులు, ఆటోడ్రైవర్ల నుంచి సమాచారం సేకరించినట్లు సమాచారం.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కిషన్



సుజాతనగర్: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా సుజాతనగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కిషన్ నియమితులయ్యారు. ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన యూనియన్ కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు కిషన్ గురువారమిక్కడ తెలిపారు. ఆయన ప్రస్తుతం బొల్లోరిగూడెం ఏజీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ప్రాజెక్టు, ప్లానింగ్ జీఎంగా మనోహర్

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ప్రాజెక్టు, ప్లానింగ్ జనరల్ మేనేజర్‌గా మనోహర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు జీఎంగా పనిచేసిన రమేష్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో పర్యావరణ జీఎం మనోహర్‌కు ఆ బాధ్యతలను అప్పజెప్పారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

టేకులపల్లి: జీఓ నం34 ప్రకారం సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు, నష్టపరిహారం ఇవ్వాలని మహాలక్ష్మి ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మాలోత్ దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇర్ప నరేశ్ కోరారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌ను మహబూబాబాద్‌లో గురువారం కలిసి సమస్య విన్నవించారు.

రేపటి రైతు సదస్సుకు తరలిరావాలి

పాల్వంచ: అశ్వారావుపేటలో 12న నిర్వహించే రైతు సదస్సుకు ఆయిల్‌పామ్ రైతులు తరలిరావాలని రైతు నాయకులు కిలారు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పాల్వంచలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. సదస్సులో శాస్త్రవేత్తలు సాగుపై సలహాలిస్తారన్నారు. కొత్త విద్యుత్కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. జి.సుందర్‌రెడ్డి, పి.విశ్వనాథం, జి.భువనసుందర్‌రెడ్డి, లింగం సురేశ్, అంజయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

బుగ్గవాగులో పడి యువకుడికి గాయాలు

ఇల్లెందు గ్రామీణం: పట్టణంలోని బుగ్గవాగులో మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు గురువారం జారిపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.


పాల్వంచ: వేడుకలకు హాజరై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు


పాల్వంచ: మార్కెట్ ఏరియా భజనమందిరంలో..


కొత్తగూడెం కలెక్టరేట్: జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏరియాలో..


లక్ష్మీదేవిపల్లిలో బతుకమ్మలతో కోనేరు చిన్ని తదితరులు..

వెళ్లిరా బతుకమ్మా.. మళ్లీ రావమ్మా!!


టేకులపల్లిలో...

న్యూస్‌టుడే యంత్రాంగం: సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం పట్టణాలతో పాటు ఊరూరా ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. 'వెళ్లిరా బతుకమ్మా.. మళ్లీ రావమ్మా' అని మహిళలు ఘన వీడ్కోలు పలికారు.

● పాల్వంచ కేటీపీఎస్ రుక్మిణీ రాధాకృష్ణ ఆలయం, మార్కెట్ ఏరియాలోని రామాలయ భజనమందిరం, నవభారత్, ఇందిరానగర్‌కాలనీ, గట్టాయిగూడెం, జగ్గతండా, కాంట్రాక్టుకాలనీ, బాపూజీనగర్, వెంకటేశ్వరహిల్స్ కాలనీల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. వేడుకల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. బతుకమ్మలను రాతిచెరువు, చింతల చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● కొత్తగూడెం పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముర్రేడు వాగు ఘాట్‌లో నిమజ్జనం చేశారు.

● లక్ష్మీదేవిపల్లి ముర్రేడు వాగు వద్ద శ్రీనగర్ కాలనీ, లక్ష్మీదేవిపల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుక నిర్వహించారు. విద్యానగర్‌కాలనీ చింతలచెరువు ఘాట్ వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేరు సత్యనారాయణ, పూర్ణచందర్‌రావు, భారాస నాయకుడు వనమా రాఘవేందర్‌రావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

● ఆడబిడ్డల బతుకమ్మలతో తెలంగాణ పూలసింగిడిగా మారిందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

● ఇల్లెందు సింగరేణి మైదానంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్, పుర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ చంద్రభాను, కమిషనర్ యాదగిరి పాల్గొన్నారు.


లక్ష్మీదేవిపల్లి: శ్రీనగర్‌లో


పాల్వంచలో..


పాల్వంచ: రాధాకృష్ణ ఆలయంలో బతుకమ్మలతో యువతులు


సుజాతనగర్: నాయకులగూడెంలో ఊరేగింపు


పాల్వంచ: కొత్వాల శ్రీనివాసరావు తదితరులు..


ఇల్లెందు: వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య


పాల్వంచ గ్రామీణం: యానంబైలులో..


ఇల్లెందు: సింగరేణి మైదానంలో బతుకమ్మలు ఆడుతూ..

మన్యంలో క్రీడా కెరటాలు

◆ సౌత్‌జోన్ పోటీలే లక్ష్యంగా కఠోర సాధన

పాల్వంచ, న్యూస్‌టుడే

చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యమిస్తూ అద్భుతంగా రాణిస్తున్నారు.. పాల్వంచ పట్టణం నెహ్రూనగర్ కాలనీలోని 'తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల' విద్యార్థినులు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు క్రీడలను వేదికగా మార్చుకుంటున్నారు. ఆసక్తిగల ఆటల్లో నిరంతర సాధనతో సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో గత నెల 19 నుంచి 23వ తేదీ వరకు వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచారు. డిసెంబరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అక్కడా ప్రతిభ చూపేందుకు సాధన కొనసాగిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్వేత ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్న పలువురు విద్యార్థులను 'న్యూస్‌టుడే' పలకరించింది.


క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అనురాధ, పీఈటీ శ్వేత

కళాశాల నిర్వాహకుల ప్రోత్సాహంతో.. గొంది సంధ్యారాణి, డిగ్రీ తృతీయ



నా చదువంతా గురుకులాల్లోనే కొనసాగింది. ఇదే క్రమంలో క్రీడలపైనా పట్టు పెరిగింది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో సీనియర్ల స్ఫూర్తితో మూడేళ్లుగా పలు పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నా. దుమ్ముగూడెం మండలం పెద్ద కమలాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబం మాది. తల్లిదండ్రులు రమేష్, సుధశ్రీలకు మంచి పేరు తెచ్చేలా ఉన్నతస్థాయికి చేరేందుకు క్రీడలు మంచి మార్గంగా భావిస్తున్నా.

కబడ్డీలో రాణించడమే లక్ష్యం: బండ్ల విద్యశ్రీ, డిగ్రీ ద్వితీయ



ఏడో తరగతి నుంచి క్రీడలంటే మక్కువ. పదో తరగతి, ఇంటర్మీడియట్, ప్రస్తుతం డిగ్రీ కళాశాల స్థాయి క్రీడాపోటీల్లో చురుగ్గా పాల్గొంటున్నా. 2023లో రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించా. ప్రస్తుతం సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యా. మా సొంతూరు అశ్వాపురం మండలంలోని వెంకటాపురం.

ఖోఖో.. పరుగులో రాణిస్తున్నా.. కల్లూరి శిరీష, డిగ్రీ తృతీయ



అయిదో తరగతి నుంచే క్రీడలపై ఆసక్తి పెరిగింది. ఎంతో ఇష్టమైన ఖోఖోతో పాటు పరుగుపందెంలో రాణిస్తున్నా. 2018-19లో ఉత్తరాఖండ్, 2022-23లో బెంగళూరు, 2018-19లో జగిత్యాల, 2021-22లో సిద్దిపేటలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. పలు పతకాలు, ఛాంపియన్‌షిప్‌లు గెలిచి సత్తా చాటుకున్నా. సౌత్‌జోన్ పోటీల్లో పతకాలే లక్ష్యంగా సాధన చేస్తున్నాం.

పీఈటీ కావడమే ధ్యేయం: మార్మ శ్యామల, డిగ్రీ ద్వితీయ



మాది జిల్లాలోని దుమ్ముగూడెం మండలంలోని ఓ మారుమూల గ్రామం. చిన్నప్పట్నుంచి క్రీడల్లో రాణించాలనే కోరిక బలంగా ఉండేది. వాలీబాల్‌లో పాఠశాల స్థాయి నుంచి మెలకువలు నేర్చుకున్నాం. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా రాణించడమే నా లక్ష్యం.

పరుగు పందెం అంటే ఇష్టం: పూనెం హర్షిత, డిగ్రీ ద్వితీయ



నాకు చిన్నప్పటి నుంచే పరుగుపందెం అంటే ఇష్టం. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే త్వరగా ఉద్యోగాల్లో నిలదొక్కుకోవచ్చు. ఈ లక్ష్యం దిశగా ప్రస్తుతం అడుగులు వేస్తున్నా. జాతీయ పోటీలకు ఎంపికకావడం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. మాది.. కరకగూడెం మండలం వెంకటాపురం గ్రామం.

వాలీబాల్, షటిల్‌లో సత్తా: అట్టు నందిని, డిగ్రీ ప్రథమ



ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఆటల్లో చురుగ్గా పాల్గొంటున్నా. ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల స్థాయుల్లో ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి వాలీబాల్, షటిల్ పోటీల్లో పాల్గొని పతకాలు దక్కించుకున్నా. 2018-19లో ఆదిలాబాద్‌లో స్టేట్‌మీట్, 2022-23లో నల్గొండలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచా.

నియంత్రిక ధ్వంసం.. రాగితీగ చోరీ

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను దొంగిలించిన ఘటన చోటు చేసుకుంది. సుదిమళ్ల పరిధిలోని కోరగుట్ట వ్యవసాయభూముల్లో ఏర్పాటు చేసేందుకు ఉంచిన 16కేవీ విద్యుత్తు నియంత్రికను బుధవారం రాత్రి దొంగలు ధ్వంసం చేశారు. ధ్వంసం చేయడంతో పాటు రూ. 30వేల విలువైన కాపర్ చోరీకి గురైందని రూరల్ ఏఈ రవి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోవులను తరలించే వాహనం పట్టివేత

పాల్వంచ గ్రామీణం: బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర నుంచి డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 22 గోవులను భాజపా నాయకులు గురువారం పాల్వంచ ఇందిరాకాలనీ సమీపంలో పట్టుకున్నారు. వాహనాన్ని స్థానిక ఠాణాకు తరలించారు. డ్రైవర్‌తో పాటు గోవుల తరలించే వ్యక్తి మోయిన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం గోవులను స్థానిక గోశాలకు తరలించారు. వాహనాన్ని పట్టుకున్న వారిలో భాజపా రాష్ట్ర నాయకుడు రవి, జిల్లా నాయకులు శివ, గంధం ప్రసాద్, క్రాంతి, వంశీ, సాయి ఉన్నారు.

సీఐకు సమ్మె నోటీసు అందజేత

టేకులపల్లి, న్యూస్‌టుడే: టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల పెంపుపై ఆ సంఘం అసోసియేషన్ స్పందించకపోవడంతో సమ్మెకు దిగనున్నట్లు ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న తెలిపారు. ఈ మేరకు టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్‌కు యూనియన్ ఆధ్వర్యంలో కలిసి గురువారం సమ్మె నోటీసు అందజేశారు. చర్చల ద్వారా వేతనాలు పెంచేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా నాయకుడు సుందర్, మదార్, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.